సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



ఘనంగా క్షీరాభిషేకం
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



విశేషంగా నిత్య కల్యాణం
ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. 8లో



వైభవంగా వారంతపు పూజలు
రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాంతపు పూజలువైభవంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

పెదబయలు: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను శుక్రవారం ఎస్పీ తుహిన్ సిన్హా చేతులు మీదుగా ప్రశంస పత్రం అందుకున్నట్టు ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ చేతుల మీదుగా అందుకోవడంతో ఎంతో సంతోషాన్నిచ్చిందని, అదే స్ఫూర్తితో సేవలు అందంచేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఈవీఎంల తరలింపు



డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తరలించేందుకు సిద్ధం చేసిన ఈవీఎంలు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంభందించి జిల్లా ఎన్నికల యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందే ఈవీఎంలు, ఇతర సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తరలించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈమేరకు జిల్లా కేంద్రం పాడేరులోని ఈవీఎం సెంటర్ నుంచి పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు కంటైనర్ల ద్వారా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లను జేసీ భావన పర్యవేక్షణలో పోలీసు బలగాల బందోబస్తు మధ్య శుక్రవారం తరలించారు. పాడేరుకు సంబంధించి ఇక్కడకి సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తరలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలతో భద్రత ఏర్పాటుచేశారు. డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీ అంబేద్కర్, మూడు నియోజకవర్గాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

పాడేరు : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతవరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. హనుమంతరావు కోరారు. శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఆయన స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో దిగువ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గంజాయి, నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలన్నారు. వీటిపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఎస్ఈబీ యంత్రాంగం పని చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాడేరు, అరకువేలి ఎస్ఈబీ స్టేషన్లను సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఎస్ఈబీ జిల్లా అధికారి ఎస్. శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, సీఐలు, సిబ్బంది ఉన్నారు.

జి.మాడుగులలో వర్షం



కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జి.మాడుగుల, కె కోడాపల్లి, నిట్టాపుట్టు, సంతబయలు, మద్దిగరువు, సుర్మతి, పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బీఎస్ఎన్ఎల్ మినహా, మిగతా నెట్ వర్క్‌లు అంతంత మాత్రంగానే వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. వాతావరణం చల్లబడటంతో వేసవితాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

- ఫస్టియర్‌లో 48, సెకండియర్‌లో 70 శాతం మేర ఉత్తీర్ణత నమోదు
- వృత్తి విద్యలో కాస్త మెరుగ్గా ఫలితాలు



సాక్షి,పాడేరు: జిల్లాలో ఇంటర్ పరీక్ష ఫలితాలు గత ఏడాది కన్నా కాస్త మెరుగుపడ్డాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల కంటే గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. బాలుర కన్నా బాలికల ఉత్తీర్ణతశాతం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఫస్టియర్ 5,623 మంది పరీక్ష రాయగా 3,689 మంది ఉత్తీర్ణులు కాగా 48 శాతం నమోదైంది. పాసైన వారిలో బాలురు 1228, బాలికలు 1461 మంది ఉన్నారు.

ద్వితీయ సంవత్సరంలో..

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 4,542 మంది పరీక్ష రాయగా 3,172మంది ఉత్తీర్ణులయ్యారు. 70 శాతం నమోదైంది. వీరిలో బాలురు 1,314మంది, బాలికలు 1,858మంది ఉన్నారు. వృత్తివిద్యకు సంబంధించి మొదటి సంవత్సరంలో 1,150 మందికి 685 మంది ఉత్తీర్ణులు కావడంతో 60 శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 961మందికి 740మంది ఉత్తీర్ణులయ్యారు.77శాతం ఫలితాలు సాధించారు. వృత్తి విద్యలోను బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు.

గురుకులాల్లో మెరుగ్గా..

గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ ఫలితాలు మెరుగుపడ్డాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలోని తొమ్మిది గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 84.83శాతం, ద్వితీయ సంవత్సరంలో 92.21శాతం ఫలితాలు వచ్చాయి. మొదటి సంవత్సరంలో 1,351మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,120 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,348 మందికి 1,238 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో మారికవలస కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ బాలికల కళాశాల 98.73 శాతంతో జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జి.మాడుగుల బాలుర కళాశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది.

రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో..

రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు గురుకుల కళాశాలలకు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో 58.9 శాతం, ద్వితీయ సంవత్సరంలో 69.43 శాతం ఫలితాలు వచ్చాయి. మొదటి సంవత్సరంలో 926 మందికి 569 మంది ఉత్తీర్ణులు కాగా 58.99 శాతం, ద్వితీయ సంవత్సరంలో 716 మందికి 536 మంది ఉత్తీర్ణులై 69.50 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూనవరం గురుకులం 87.13 శాతం, రంపచోడవరం 88.82 శాతం ఫలితాలతో సత్తా చాటాయి.

కేజీబీవీ విద్యాలయాల్లో

జిల్లాలోని 19 కేజీబీవీ విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 583 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 331మంది పాసై 57 శాతం ఉత్తీర్ణత లభించింది. ద్వితీయ సంవత్సరంలో 538 మందికి 389 మంది ఉత్తీర్ణులై 72 శాతం ఫలితాలు సాధించారు .మొదటి సంవత్సరంలో జి.మాడుగుల కేజీబీవీ విద్యార్థులు నూరు శాతం, ద్వితీయ సంవత్సరంలో అనంతగిరి, జీకేవీధి కేజీబీవీ విద్యార్థులు నూరు శాతం ఫలితాలతో సత్తా చాటారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వీరే

రంపచోడవరం గురుకుల కళాశాలకు చెందిన ఆర్. శివ శిరీష (972, బైపీసీ), కె.పావని (949,ఎంపీసీ), ఎం.లోవశ్రీ (943,ఎంపీసీ), పాడేరు కేజీబీవీ పాఠశాలకు చెందిన పచ్చా హరిప్రియ (950, ఎంపీసీ), జి.మాడుగుల గురుకుల కళాశాలకు చెందిన బి.వెంకట సాయితేజ (947, ఒకేషనల్), దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన లక్ష్మీ ప్రశాంతి (938, ఎంపీసీ), అరకులోయ గురుకుల కళాశాలకు చెందిన కిల్లో చైతన్య (919, బైపీసీ) ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు.



ఆర్.శివ శిరీష



పచ్చా హరిప్రియ



కె.పావని



బి.వెంకట సాయితేజ



ఎం.లోవశ్రీ



లక్ష్మిప్రశాంతి



కిల్లో చైతన్య

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామ లేఖలను అందజేస్తున్న చింతూరు గ్రామ సచివాలయం వలంటీర్లు

చింతూరు: స్థానిక గ్రామ సచివాలయం–1లో విధులు నిర్వహిస్తున్న 42 మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పొంద్రు మహేష్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులకు దూరంగా ఉండటంతో పాటు తమకు ప్రభుత్వం ఇచ్చిన సామగ్రిని కూడా అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. తాము విధులకు దూరంగా ఉంటున్నా.. తమ బంధువులతో మాట్లాడుతున్నా ఇతర పార్టీల నాయకులు తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వలంటీర్ల బాధ్యతల నుంచి వైదొలగాలని భావించి మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్ల వ్యవస్థ కుల మతాలు, పార్టీలకు అతీతంగా అవినీతికి తావులేకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. పేదల సంతోషంలో తమను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆత్మసంతృప్తి ఇచ్చిందని ఆయన తెలిపారు. ప్రతిఇంట్లో తమను కన్నబిడ్డలకంటే ఎంతో ఆదరించారని, అవ్వా, తాతలకు సేవచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు సైన్యంలా పనిచేసి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని వలంటీర్లు తెలిపారు. ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి పార్టీ గెలుపునకు తమ శాయశక్తులా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. రాజీనామా చేసిన వారిలో మిడియం ముత్తయ్య, కారం శ్రీరామ్, సోడె కళ్యాణి, కుర్సం సమత, పీసం సుబ్బారావు, బంగారు సుమన్ తదితరులు ఉన్నారు.



చింతపల్లి ఎంపీడీవో వీరసాయిబాబుకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

చింతపల్లి రూరల్: మండలంలో కొమ్మంగి పంచాయితీకి చెందిన ఎనిమిది మంది వలంటీర్లు మండల వలంటీర్ల సంఘ అధ్యక్షుడు పరమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో వీరసాయిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవ చేసే అదృష్టాన్ని ఇస్తే, చంద్రబాబు దూరం చేశారన్నారు. అందుకనే మా విధులకు రాజీనామా చేసి ప్రజలకు జగనన్న చేసిన అభివృద్ధిని వివరిస్తామని వారు తెలిపారు. జగనన్నను మళ్లీ గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు.

14న అనకాపల్లిలో హాస్య వల్లరి

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డు వైఎంవీఏ శ్రీధరాల వెంకటరమణ మెమోరియల్ హాల్లో ఈనెల 14న లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'హాస్యంతో అల్లరి' కార్యక్రమం రాత్రి 7 గంటలకు నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు దాడి వాసు, కార్యదర్శి బొడ్డేడ మురళి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో హాస్యంతో అల్లరి కార్యక్రమం కరపత్రాలను క్లబ్ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాడి వాసు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. క్లబ్ ఏర్పాటు చేసి పదేళ్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి వినకోట బుచ్చిరాజు, సభ్యులు, క్రీడామైదానం వాకర్స్ ఎం.రమణ, సాయి, నాయుడు, అజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

రాత్రి పూట వాహన రాకపోకలు నిలిపివేత

- మావోయిస్టుల బంద్‌కు పిలుపు నేపథ్యంలో అప్రమత్తం



కొయ్యూరు నుంచి వెనక్కి నర్సీపట్నం వెళ్లిపోతున్న బందమామిళ్ల బస్సు

చింతూరు: మావోయిస్టుల బంద్ నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా మూడు రోజులపాటు చట్టి–భద్రాచలం, చట్టి–కుంట మార్గంలో రాత్రిపూట వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ రెండు మార్గాల్లో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు చట్టి జంక్షన్ వద్ద వాహనాలు నిలిపి వేస్తామని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీలేరు: సీపీఐ మావోయిస్టు పార్టీ ఈ నెల 13 నుంచి 15 వరకు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా సీలేరు మీదుగా విశాఖపట్నం, భద్రాచలం నడిచే నైట్ సర్వీసులు, నైట్ హాల్ట్ సర్వీసులను రద్దు చేశారు. వీటిని ఈనెల 17 నుంచి పునరుద్ధరిస్తామని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.

కొయ్యూరు: మావోయిస్టుల బంద్ నేపథ్యంలో బూదరాళ్ల, మంప, రేవళ్ల వెళ్లే బస్సులను నిలిపివేసి కొయ్యూరు నుంచి వెనక్కి పంపిస్తున్నారు. నైట్‌హాల్ట్ బస్సులను పోలీసు స్టేషన్ వద్ద నిలిపివేసి ఉదయం కొయ్యూరు నుంచి వెనక్కి పంపిస్తున్నారు.

విభిన్నంగా.. విస్తృతంగా..

- వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు ఎన్నికల ప్రచారం
- సమస్యలు తెలుసుకుంటూ.. భరోసానిస్తూ ప్రజలతో మమేకం



పెట్రోల్ బంకులో ఇంధనం వేస్తూ ఆకట్టుకుంటున్న అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు



వెల్డింగ్ కార్మికుడికి సాయం చేస్తున్న పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు

పాడేరు : వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఎన్నికల ప్రచారం శుక్రవారం పాడేరు పట్టణంలో విభిన్నంగా.. విస్తృతంగా సాగింది. పట్టణంలోని సినిమాహాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, భారత్ పెట్రోల్ బంకు ఏరియాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్తకుల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు చేసి గెలిపించాలని అభ్యర్థించారు. పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు ఇంధనం పోస్తూ ఆకట్టుకున్నారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టేందుకు ఓటు వేసి సహకారం అందించాలని కోరారు. జ్యూస్ తయారు చేస్తూ, వెల్డింగ్, బైక్ మెకానిక్‌లకు సాయం అందించారు. సమస్యలు తెలుసుకుంటూ వారితో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ సూరిబాబు, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, బసవన్నదొర, నీలకంఠం, లక్ష్మణరావు, ఎంపీటీసీలు సన్యాసిరావు, నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, టౌన్ అధ్యక్షుడు డీపీ రాంబాబు, సీనియర్ నాయకులు కన్నాపాత్రుడు, నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం



టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యలింగం, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం
- టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

అరకులోయ రూరల్: జగనన్నతోనే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమని అరకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలో సుంకరమెట్ట పంచాయతీ దండబాడు గ్రామంలో శుక్రవారం ఆయన సమక్షంలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ చిటంనాయక్ అప్పన్నతో పాటు 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు, ఈ సందర్భంగా రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేసిందన్నారు. ప్రతి పక్ష పార్టీల అమలుకాని హామీలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జగనన్నతోనే భవిష్యత్తు సాధ్యమన్నారు. ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగంను గెలిపించాలని కోరారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి పార్టీలు కుట్ర పన్నాయన్నారు. మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, వైస్ ఎంపీపీ సుమంజల్లి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రమేష్, ఎంపీటీసీలు శత్రుఘ్న, ఆనంద్‌కుమార్,సర్పంచ్ సుస్మిత, పీఏసీఎస్ డైరెక్టర్ పుష్ప, మహిళ విభాగం జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

- ఇద్దరికి స్వల్పగాయాలు



గాయపడిన కాంట్రాక్టర్ శివ



తీవ్రంగా గాయపడిన సుందరరావుకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి సంతోష్,సిబ్బంది

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో చోటాముఖిపుట్టు గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కించాయిపుట్టు పంచాయతీ కుమ్మిడిపుట్టు గ్రామానికి చెందిన అన్నదమ్ములు కొర్రా సుందరరావు, రామకృష్ణ పర్తపుట్టు గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి ముంచంగిపుట్టు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ శివ ముంచంగిపుట్టులో పనులు ముగించుకొని పెదబయలు బైక్‌పై వస్తున్నారు. ఎదురెదురుగా వస్తునన వీరిద్దరు బైక్‌లు చోటాముఖిపుట్టు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ఢీకొన్నాయి. ఈ ఘటనలో సుందరరావు కుడికాలు విరిగిపోవడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. కాంట్రాక్టర్ శివ, రామకృష్ణ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108లో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి సంతోష్, వైద్య సిబ్బంది వీరికి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన సుందరరావును మెరుగైన వైద్య సేవల నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జీడిమామిడి తోటలో అగ్ని ప్రమాదం

- 10 ఎకరాల్లో పంట నష్టం



జీడిమామిడి తోటలో సంభవించిన మంటలు

పాడేరు : మండలంలోని దేవాపురం పంచాయతీ మారుమూల తుమ్మలపాలెంలో గిరిజన రైతులకు చెందిన పది ఎకరాల జీడిమామిడి తోటల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన వంతు పైడన్నదొర, రజనీబాబు, నర్సింహమూర్తి, పైడితల్లి, రాజులమ్మ అనే గిరిజన రైతులకు చెందిన తోటల్లో శుక్రవారం మధ్యాహ్నం మంటలు ఎగిశాయి. కాపు దశలో ఉన్నందున భారీగా నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదం సంభవించడానికి కారణాలు తెలియరాలేదు. అధికారులు స్పందించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నిన్నెలా నమ్మేది చంద్రబాబూ..

చింతూరు/ముంచంగిపుట్టు: కూటమి అధికారంలోకి వస్తే తమకు రూ.10 వేల వేతనం ఇస్తామంటున్న చంద్రబాబు మాటల్ని నమ్మేది లేదని పలువురు వలంటీర్లు స్పష్టంచేశారు. ఇప్పటి వరకు తమపై విమర్శలు చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు రూట్ మార్చి వైఎస్సార్‌సీపీ ఇచ్చిన మొత్తం కంటే ఎక్కువ ఇస్తామని మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని చంద్రబాబు రెండు నాల్కల ధోరణికి ఇది నిదర్శనమన్నారు. మాపై ఆరోపణలు చేసిన చంద్రబాబు ఈరోజు వలంటీర్ వ్యవస్థను పొగుడుతున్నారని.. తమ ద్వారా ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న కుట్రకు తెరలేపారని విమర్శించారు.

బాధించిన ఆరోపణలు



చంద్రబాబు, పవన్ కల్యాణ్ తమపై చేసిన ఆరోపణలు ఎంతగానో బాధించాయి. ఇప్పుడు మమ్మల్ని మంచి చేసుకుని ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు తమపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు. ప్రతి ఒక్కరి సమాచారాన్ని సంఘ విద్రోహ శక్తులకు చేరవేస్తున్నారన్నవారు. ఇప్పుడు వలంటీర్లకు ఎందుకు గౌరవ వేతనం పెంచుతామంటున్నారు.

– ఎల్. ధనలక్ష్మి, కొత్త సుజనకోట

లబ్ధి పొందేందుకు కూటమి కుట్ర



ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మాత్రమే చంద్రబాబు రూ.10 వేతనం ఇస్తామని ప్రకటించారు. ఆయన వలంటీర్ల వ్యవస్థ పట్ల ఎంతో హీనంగా మాట్లాడారు. అవన్నీ గుర్తున్నాయి. ఇప్పుడు ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు మా అవసరం వచ్చింది. చంద్రబాబు గెలిస్తే మమ్మల్ని రోడ్డుమీద నిలబెడతారు.

– జి.దేవ, ముంచంగిపుట్టు

జగనన్న వెంటే మేము



వలంటీరు వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఇస్తానంటే నమ్మే ప్రసక్తేలేదు. అధికారంలోకి వచ్చాక మమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించి జన్మభూమి కమిటీల మాదిరిగా వారి పార్టీ కార్యకర్తలకు కట్టబెడతారు. మేము మాత్రం మళ్లీ జగనన్నే అధికారంలోకి తెచ్చుకుంటాం.

– పొంద్రు మహేష్, చింతూరు

టీడీపీ వేధింపుల వల్లే రాజీనామా



వలంటీర్ విధులకు దూరంగా ఉంటున్నా టీడీపీ నాయకులు తమను అనుమానంగా చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేస్తున్నారంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. అందుకే రాజీనామా నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి జగనన్నకు సాయపడతాం.

– తుర్రం నాగలక్ష్మి, చింతూరు

జగనన్న గెలుపునకు కృషి



వలంటీర్ విధుల్లో ఉంటే జగనన్న కోసం ప్రచారం నిర్వహించేందుకు అవకాశం లేదు. ప్రస్తుతం విధులకు రాజీనామా చేసినందున ఇకపై పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం చేసి జగనన్న ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తాం. జగనన్న విజయానికి సైనికుల్లా పనిచేసి చంద్రబాబుకు మా సత్తా చూపిస్తాం.

–మడివి రజని, చింతూరు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



కినంగూడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న ఎంతో కృషి చేశారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేద్దామని, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం చెప్పారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిదిలో కినంగూడ,దండబాడు,సంగంవలస గ్రామల్లో శుక్రవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. మత్స్యలింగం మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి సాధించేందుకు జగనన్నను మళ్లీ సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు శెట్టి అప్పాలు, కమిడి అశోక్‌కుమార్,ఆనంద్‌కుమార్, సుమాంజలి, పుష్ప, గాసీ, శత్రుగున్, బాలరాజు, రమేష్, కరణ్‌కుమార్, సాంబ, లక్ష్మణ్‌కుమార్, విజయ్‌కుమార్, సుంద్ర, రాధిక సుస్మిత, కొండలరావు, నాబో, రామ్మూర్తి ,శ్రీరాం, అప్పలస్వామి, పూర్ణ, నర్సింగ్, రఘు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బయ్యవరం హైవే వద్ద అదుపు తప్పిన ప్రైవేట్ కళాశాల వాహనం
- రోడ్డు పక్క మొబైల్ క్యాంటీన్‌ను ఢీకొనడంతో 11మందికి గాయాలు
- అక్కడికక్కడే బాలుడు మృత్యువాత.. తల్లికి తీవ్ర గాయాలు
- ప్రమాదంలో చిక్కుకున్న పెందుర్తికి చెందిన ముస్లిం కుటుంబం



బయ్యవరం వద్ద రోడ్డు ప్రమాదంలో మొబైల్ క్యాంటీన్ వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ కళాశాల బస్సు (ఇన్‌సెట్) ప్రమాదంలో మృతి చెందిన షేక్ గౌస్

కశింకోట: అదుపు తప్పి మొబైల్ క్యాంటీన్ మీదకు దూసుకొచ్చిన ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సు బీభత్సం సృష్టించింది. ఆ సమయానికి అక్కడున్న పదకొండుమంది గాయపడగా అందులో 12 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. సీఐ ఎం.వినోద్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. పెందుర్తి రెల్లికాలనీకి చెందిన షేక్ రెహమాన్ తన మేనల్లుని వివాహం పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి కారులో పిఠాపురంలోని బంధువుల వద్దకు బయలుదేరారు. కశింకోట మండలం బయ్యవరం వద్ద ఆగి మొబైల్ క్యాంటీన్ దగ్గర టిఫిన్ చేస్తుండగా.. అనకాపల్లి నుంచి మాకవరపాలెం వైపు విద్యార్థులతో వెళుతున్న ప్రైవేటు కళాశాల బస్సు దూసుకొచ్చింది. పక్కగా వెళుతున్న కారును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి కొత్తపల్లి రోడ్డు వైపు వేగంగా దూసుకుపోయి పక్కనున్న మొబైల్ టిఫిన్ వాహనాన్ని ఢీకొంది. ఈ దుర్ఘటనలో షేక్ రెహమాన్ కుమారుడు షేక్ గౌస్ (12) అక్కడికక్కడే మృతి చెందాడు. రెహమాన్‌తోపాటు భార్య షేక్ ఉన్నిసా బేగం వారి కుమార్తె షబ్బీర్ యాసిన్, మేనల్లుడు షేక్ అలీ హుస్సేన్, బంధువు సయ్యద్ బాబ్జీ, టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు గొన్నాబత్తుల లక్ష్మి, టిఫిన్ చేస్తున్న స్థానికులు కరణం లక్ష్మణరావు, గొల్లవిల్లి రమణమ్మ, అనిల్‌కుమార్, రామకృష్ణ గాయపడ్డారు. వీరిని హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు.



క్షతగాత్రులు

వీరిలో రెహమాన్ భార్యకు పక్కటెముకులకు, తలకు బలమైన గాయమై విషమంగా ఉండడంతో విశాఖ డెయిరీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు అనకాపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. షేక్ అలీ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం జరిపించినట్లు సీఐ తెలిపారు. ప్రమాదంలో నాలుగు మోటారు సైకిళ్లు, క్షతగాత్రుల కారు, టిఫిన్ సెంటర్ వాహనం దెబ్బతిన్నాయి. ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

క్షతగాత్రులకు పరామర్శ

అనకాపల్లి: కశింకోట మండలం బయ్యవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు.

ఘనంగా క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీ దళార్చన.. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



జస్వంత్

హుకుంపేట: కొట్నాపల్లికి చెందిన తాంగుల జస్వంత్(15) సంవత్సరాల బాలుడు కనిపించడం లేదని తండ్రి కొండబాబు తెలిపారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పాడేరు నెంబర్-1 ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల 10వ తరగతి పరిక్షలు రాసి కొట్నాపల్లి ఇంటికి వచ్చాడని, అయితే ఈ నెల 4న పాడేరులో ఉన్న పిన్ని ఇంటికి వెళ్తానని బయలుదేరాడని, నేటికీ జస్వంత్ ఆచూకీ తెలియలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాడేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ బాలుడిని ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే 93476 19636, 94939 42847 నంబర్లకు సమాచారం అందించాలని తల్లిదండ్రులు కోరారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తికి రిమాండ్



సారాతో పట్టుబడిన నిందితుడితో పోలీసు సిబ్బంది

పెదబయలు: మండలంలోని గలగండ పంచాయతీ సిరిశపల్లి గ్రామానికి చెందిన పాంగి సుబ్బారావు శుక్రవారం ఒడిశా నుంచి 10 లీటర్ల సారాను గ్రామానికి తెచ్చి అమ్ముతుండగా అదుపులో తీసుకున్నట్టు ఎస్‌ఐ మనోజ్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బెల్లం పులుపు ధ్వంసం

నాతవరం: సరుగుడు, రామన్నపాలెం, అచ్చంపేటలో సారా బట్టీలపై దాడులు చేసి 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్‌ఈబీ ఎస్‌ఐ రహీం చెప్పారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ , శిక్షణకు హాజరైన అధికారులు, సిబ్బంది


రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి అవగాహనతో ఎన్నికల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్, ఆర్‌ఓ ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పీవోలు, ఏపీఓలకు ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌ల వినియోగంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌ఓ ఎస్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. 59 మంది సెక్టార్ అధికారులను, 73 మంది రూట్ అధికారులను నియమించినట్టు చెప్పారు. రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై. రామవరం మండలాలకు సంబంధించిన 307 మంది పీవోలు, ఏపీఓలకు ముందుగా ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లపై అవగాహన శిక్షణ కార్యక్రమం రెండు రోజులు జరుగుతుందన్నారు. ఎన్నికలకు ముందు రోజు ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు తీసుకొని, పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్నికలు సజావుగా నిర్వహించి తిరిగి వాటిని అప్పగించే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్నికల రోజు ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్ నిర్వహించాలని, అందుకు సిబ్బంది పక్కాగా శిక్షణ పొందాలన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో సుమారు 600 నుంచి 1000 మంది లోపు ఓటర్లు ఉంటారని తెలిపారు. ఓటర్లతో ఎటువంటి తగాదాలకు తావు లేకుండా చాలా జాగ్రత్త వహించాలని సూచించారు. పోలింగ్‌కు సంబంధించిన ఫారాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి ఎన్నికల పోలింగ్ శాతాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు వినియోగం, శిక్షణపై పూర్తి స్థాయిలో అవగాహన పొందాలన్నారు. పీవోలు, ఏపీవోలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. శిక్షణకు వచ్చిన ఎన్నికల సిబ్బందికి భోజన సదుపాయం, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు చేస్తామన్నారు. తహసీల్దార్లుఎ.కృష్ణజ్యోతి, ఎ.వి.రమణ, డి.వి.సత్యనారాయణ, డీటీలు ఎస్.వి.వి.సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, బాలాజీ, శివ, శ్రీధర్, విశ్వనాథం, స్వామి, జి.సత్యనారాయణ, వీరభద్రరావు, సరిత, ఆర్‌ఐ ఎస్.విగ్నేష్ పాల్గొన్నారు.

వైభవంగా వారాంతపు పూజలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

‘విత్తు’ కొంటున్న కొత్త ఆశలు

- పాత వంగడాలకు స్వస్తి
- చెరకులో ‘శ్రీ సాగు’పై పెరుగుతున్న ఆసక్తి
- 40 లక్షల ఒంటికన్ను ముచ్చులను నజ్బడీపై ఇస్తున్న గోవాడ ఫ్యాక్టరీ



ఒంటికన్ను ముచ్చు తయారు చేసేందుకు సిద్ధం చేసిన విత్తనం



రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఒంటికన్ను ముచ్చు

చోడవరం: తగ్గుతున్న భూ సారం, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కాలుష్యం తదితర కారణాలతో చెరకు దిగుబడి రానురానూ తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో కుదేలవుతున్న రైతులకు చెరకు పరిశోధన కేంద్రాలు, సుగర్ ఫ్యాక్టరీ అండగా నిలుస్తూ వారిలో అవగాహన కల్పిస్తున్నాయి. కొత్త వంగడాలు, శ్రీసాగు పద్ధతిపై సదస్సులు నిర్వహిస్తూ ఆ దిశగా వారిని సమాయత్తం చేస్తున్నాయి. దీంతో చెరకు రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త వంగడాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై చెరకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాధారణ పద్ధతిలో వేసే తోటలు తుపాన్ల సమయంలో నేలవాలుతుండడంతో ఆ పరిస్థితులను తట్టుకునే శ్రీసాగు విధానంపై మక్కువ చూపుతున్నారు. దీంతో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ తనవంతు సాయంగా ఒంటికన్ను విత్తనాన్ని అందించేందుకు కొత్తవంగడాలకు సిద్ధం చేసింది.

విస్తృతంగా సదస్సులు

జిల్లాలో సాధారణ చెరకు విస్తీర్ణం 80వేల ఎకరాలు. పాత రకాల విత్తనాలనే రైతులు మళ్లీమళ్లీ వేయడం, భూమిలో సారం తగ్గడం తదితర కారణాలతో ఆశించనంతగా పంట దిగుబడి రావడం లేదు. పాత విత్తనాలు ఎక్కువగా చీడపీడలకు గురవుతున్నాయి. దీంతో అనకాపల్లి, కొండెంపూడి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు చెరకులో కొత్త వంగడాలు, సాగులో కొత్త విధానాలను అందుబాటులోకి తెచ్చి, రైతులు ఆచరించే విధంగా విస్తృతంగా సదస్సులు నిర్వహిస్తున్నాయి.జిల్లాలో గోవాడ ఫ్యాక్టరీ మాత్రమే ఈ ఏడాది రెగ్యులర్ క్రషింగ్ చేసింది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 30వేల ఎకరాల్లో చెరకు సాగు జరుగుతోంది. గతంలో ఒంటికన్ను ముచ్చుతో శ్రీసాగు విధానంలో అతి కొద్ది మంది మాత్రమే చెరకు సాగు చేసేవారు. గత నాలుగేళ్లుగా ఈ విధానాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. 2024-25 క్రషింగ్ సీజన్‌కు 40 లక్షల ఒంటికన్ను ముచ్చు కొత్త వంగడాలను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంది. పలు ప్రాంతాల్లో నర్సరీలు పెంచి, అక్కడ నుంచి రైతులకు సరఫరా చేసేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం సిద్ధం చేసింది.

శ్రీసాగు విధానంపై ఆసక్తి

పాత పద్ధతిలో ఎకరాకు నాలుగు టన్నుల చెరకు విత్తనం అవసరవుతుంది. సాలుకు-సాలుకు మధ్య రెండు లేక రెండున్నర అడుగుల దూరంలో విత్తనం నాటుతారు. శ్రీసాగులో మాత్రం చెరకు కన్నులను మాత్రమే నాటుతారు. ఎకరాకు 6,500 మొక్కలు (కన్నులు) సరిపోతాయి. దీనివల్ల చెరకు తోటల్లో అంతర్‌పంటలు కూడా వేసుకుని ఆదాయం పొందవచ్చు. బోరులు ఉండి అవసరానికి తగ్గట్టుగా నీరు పెడితే సరిపోతుంది. శ్రీసాగు పద్ధతి వల్ల ఎకరాకు రూ.15వేలు వరకు పెట్టుబడి ఆదా అవుతుంది. సాధారణ పంట ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తే శ్రీసాగు వల్ల ఎకరాకు 40 టన్నులు పైబడి దిగుబడి సాధించవచ్చని చెరకు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈఏడాది ఎక్కువ మంది రైతులు శ్రీసాగుపై ఆసక్తి చూపుతున్నారు.

చెరకులో కొత్త వంగడాలు

చెరకులో 2009ఎ107, 87ఎ298, 2003వి46, 2006ఎ81, 2006ఎ252 అనే కొత్త రకాల వంగడాలను వేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. దీంతో ఈ రకాల్లోనే ఒంటికన్ను ముచ్చు విత్తనాన్ని గోవాడ ఫ్యాక్టరీ సిద్ధం చేస్తోంది. గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో గజపతినగరం, గోవాడ , చినపాచిలి(రావికమతం), అంబేరుపురం, రోలుగుంట మండలంలో రెండు గ్రామాల్లో ఒంటికన్ను ముచ్చు విత్తనం తయారు చేసేందుకు నర్సరీలు నిర్వహిస్తున్నారు.

విశేషంగా నిత్య కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం , యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో అప్పన్న కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలతో కల్యాణ మండపం కిక్కిరిసింది. వారికి కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కొల్లాం (08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 17 నుంచి జూలై 3వ తేదీ వరకు నడుస్తుంది. కొల్లాం-విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 18 నుంచి జూలై 4వ తేదీ వరకు నడుస్తుంది.

- భువనేశ్వర్-యల్హంక(02811) స్పెషల్ భువనేశ్వర్‌లో ప్రతీ శనివారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.55 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు యల్హంక వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 13వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు నడుస్తుంది. యల్హంక-భువనేశ్వర్(02812) స్పెషల్ యల్హంకలో ప్రతీ సోమవారం ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. 15 నుంచి మే 27వ తేదీ వరకు నడుస్తుంది.
- హౌరా-యశ్వంత్‌పూర్(02863) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ గురువారం హౌరాలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.45గంటలకు బయలుదేరి అదేరోజు మధ్య రాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. 18 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది.
యశ్వంత్‌పూర్- హౌరా (02864) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారం యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయలుదేరి మరసటి రోజు మధ్యాహ్నం 1.25 గంలకు హౌరా వెళ్తుంది. 20 నుంచి జూన్ 29వ తేదీ వరకు నడుస్తుంది.
- కొచ్చువేలి-షాలిమర్(06081) ప్రతీ శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 10.52 గంటలకు బయలుదేరి ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమర్ వెళ్తుంది. 12 నుంచి మే 31వ తేదీ వరకు నడుస్తుంది. షాలిమర్-కొచ్చువేలి(06082)లో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.20గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి వెళ్తుంది. ఈ రైళ్లు ఈ నెల 15 నుంచి జూన్ 3వ తేదీ వరకు నడుస్తుంది.